క్లుప్తంగా

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర వెలకట్టలేనిది



షరీఫ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ గంగాధరావు, డాక్టర్ సిరాజుద్దీన్

నల్లజర్ల: వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్లు కీలక పాత్ర వహించి, వైద్యం సక్రమంగా అందేలా వారి నివేదికల ద్వారా తోడ్పాటు అందిస్తున్నారని పీహెచ్‌సీ వైద్యుడు గంగాధరరావు అన్నారు. ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ల డే సందర్భంగా నల్లజర్ల పీహెచ్‌సీలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ మహమ్మద్ ఉమర్ షరీఫ్‌ను ఆయన, డాక్టర్ సిరాజుద్దీన్ గురువారం సత్కరించారు. కార్యక్రమంలో జీవీవీ ప్రసాద్, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లలను విలువలతో పెంచాలి

నిడదవోలు : పిల్లలు ఉత్తమ విలువలతో పెరిగేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంటుందని ప్రిన్సిపల్ పద్మజ అన్నారు. పట్టణంలోని ఏకేఆర్‌జీ హైస్కూల్లో గురువారం సత్యంతో జీవిద్దాం–స్వచ్ఛంగా జీవిద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. 70 మంది విద్యార్థుల తల్లిదండ్రులు కార్యక్రమానికి హాజరయ్యారు. చక్కగా మాట్లాడిన 11 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ చావ గోకుల్, మేనేజర్ బురుగుపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నేడు నిలిపివేత

ఉండ్రాజవరం: 11 కేవీ చివటం ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపు పనుల నిమిత్తం పాలంగి సబ్ స్టేషన్ పరిధిలోని పాలంగి, చివటం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. ఈ గ్రామాల పరిధిలో గృహ, వాణిజ్య, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయ త్రిఫేస్ విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1గంట నుంచి 5 గంటల వరకు ఇవ్వబడునని తెలిపారు.

గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని తాడిమళ్ల కోరుపల్లి, మునిపల్లి, పెండ్యాల, కాటకోటేశ్వరం, కోరుమామిడి గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. ఆ గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

చాగల్లు: స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. 2024-25 సంవత్సరానికి గానూ బీసీలు, జనరిక్ ఫార్మసీ చదువుకున్న నిరుద్యోగులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో ఆర్థిక సాయం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే కాపు సామాజిక వర్గాలకు బ్యాంకు రుణం, సబ్సిడీతో ఆర్థిక సాయం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడం అవకాశం కల్పించడం జరిగిందన్నారు.

అచ్చమైన స్త్రీవాది రాయప్రోలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తెలుగు కవిత్వంలో స్త్రీకి తగిన గౌరవం ఇచ్చి, కథానాయికలను సాధారణ యువతులుగా చిత్రీకరించిన అచ్చమైన స్త్రీవాది రాయప్రోలు సుబ్బారావు అని ప్రసిద్ధ కవయిత్రి కండెపు సునీత అన్నారు. స్థానిక సంహిత డిగ్రీ కళాశాలలో గురువారం ఆంధ్ర మహిళా సభ, సంహిత డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'తెలుగు కవుల రచనలలో స్త్రీ పాత్ర' అనే సదస్సు నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ రాయప్రోలు గొప్ప జాతీయవాది అని కొనియాడారు. సంహిత కళాశాల వ్యవస్థాపకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సాధారణ స్త్రీకి దేవతా స్థానాన్ని ఇచ్చి అద్భుతమైన రచనలు చేసిన తొలి వ్యక్తి రాయప్రోలు అన్నారు. కార్యక్రమంలో జి.నాగిరెడ్డి, ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, తెలుగు అధ్యాపకులు పి.జయరాజ్, హర్షిత అనూహ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌కేఆర్ మహిళా కళాశాల వార్షికోత్సవం

సీటీఆర్ఐ: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లయన్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజర్ మాటూరి మంగతాయారు, క్రీడా విభాగం నుంచి పి.శ్రీలక్ష్మి హాజరయ్యారు. విద్య, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంగతాయారు మాట్లాడుతూ విద్యార్థులు తమ అధ్యాపకులను గౌరవించాలని, కళాశాలలో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

ముమ్మరంగా పొగాకు గ్రేడింగ్

నల్లజర్ల: గోపాలపురం వేలం కేంద్ర పరిధిలో నల్లజర్ల మండలంలోని పోతవరం, కవులూరు, పోతినీడుపాలెం, అనుమునిలంక, సుభద్రపాలెం గ్రామాల్లో వర్జీనియా పొగాకు గ్రేడింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పొగాకు క్యూరింగ్ 50 శాతం పైగా పూర్తయినట్టు రైతులు చెబుతున్నారు. ఈ నెల 24న వేలం ప్రక్రియ ప్రారంభం కానున్నందున ఆయా గ్రామాల్లో గ్రేడింగ్ పూర్తి చేసి, బేళ్లుగా తయారు చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పొగాకును 1, 2, 3, సూర, పచ్చ అనే ఐదు రకాలుగా గ్రేడింగ్ చేస్తున్నారు. 150 కిలోల్లోపు ఉండేలా బేళ్లు సిద్ధం చేస్తున్నారు. గ్రేడింగ్ చేసిన పొగాకును రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గాలి తగలని ప్రదేశంలో పొగాకు మండెలు వేసి, పదును ఆరకుండా చర్యలు తీసుకుంటున్నారు. పోతవరం, పోతినీడుపాలెం, సుభద్రపాలెం, కవులూరు గ్రామాల్లో 520 బ్యారన్లకు గాను 1,800 ఎకరాల్లో వర్జీనియా పొగాకు సాగు జరుగుతోంది. వందలాది మంది మహిళా కూలీలు గ్రేడింగ్ పనుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. పొగాకు గ్రేడింగ్ సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వేలం కేంద్రం అధికారులు సూచిస్తున్నారు. గ్రేడింగ్ హాలులో టార్పాలిన్లు వేసి ఇతర పదార్థాలు కలవకుండా కూలీల వద్ద అట్టపెట్టెల వంటివి ఏర్పాటు చేయాలని చెబుతున్నారు. పొగాకులో అన్య పదార్థాలు కలవడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ఇబ్బంది కలుగుతుందని అంటున్నారు.



పొగాకు గ్రేడింగ్ చేస్తున్న మహిళా కూలీలు



పోతినీడుపాలెంలో క్యూరింగ్ చేసిన పొగాకును ఆరబెడుతున్న కూలీలు

ఆశాజనకంగా దిగుబడులు



ఈ ఏడాది పొగాకు దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. ధరలు ఎలా ఉంటాయనేదే ప్రశ్నార్థకంగా ఉంది. గత ఏడాది ధరలు చూసి చాలా మంది అధిక మొత్తంలో కౌలు పెంచి, భూములు తీసుకున్నారు. బ్యారన్ ధరలు పెరిగాయి. మరోవైపు పెట్టుబడులు కూడా పెరిగాయి. ఇదే సమయంలో కూలీల కొరత తీవ్రంగా ఉంది.

– యలమర్తి మణికంత, రైతు, పోతినీడుపాలెం

కూలీలకు పుష్కలంగా పనులు



వర్జీనియా పొగాకు సాగుతో ఈ ప్రాంతంలో కూలీలకు పనులు పుష్కలంగా దొరుకుతున్నాయి. పురుషుడికి రోజుకు రూ.వెయ్యి, ఆడ కూలీకి రూ.600 చొప్పున ఇస్తున్నారు.

– ముప్పిడి వెంకట్రావు

పన్ను బకాయిదారులకు షాక్

కుళాయి కనెక్షన్లు తొలగించిన అధికారులు



లింగంపల్లిలో బకాయిదారు కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది

నిడదవోలు : మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, కుళాయి పన్ను బకాయిదారులపై గురువారం అధికారులు కొరడా ఝుళిపించారు. ఇంటి, కుళాయి పన్నులు భారీగా బకాయి పడినవారి ఇళ్లకు గురువారం మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. మంచినీటి కుళాయి కనెక్షన్ కట్ చేసి నీటి సరఫరా నిలుపుదల చేశారు. మున్సిపల్ చట్టం 1965ను అనుసరించి మంచినీటి కనెక్షన్లను తొలగించి నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. ఇంటి, కుళాయి పన్నులు వెంటనే చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పట్టణ ప్రజలను ఆమె కోరారు.

రైల్వే స్టేషన్‌లో శునక సంచారం

- భయభ్రాంతులకు గురవుతున్న ప్రయాణికులు
- జీఎం పర్యటన రోజూ పట్టించుకోని అధికారులు



రైల్వే స్టేషన్‌లో బుకింగ్ కౌంటర్ వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వీధి కుక్కలు

నిడదవోలు: నిడదవోలు జంక్షన్ రైల్వే స్టేషన్‌లో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. రైల్వే స్టేషన్‌లో బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పర్యటన సందర్భంగా స్టేషన్‌లో పారిశుధ్య పనులను అధికారులు ఆగమేగాలపై చేపట్టారు. అప్పుడప్పుడు కనిపించే పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దడానికి పోటీ పడ్డారు. డ్రెస్‌కోడ్ పాటించి సిబ్బంది హడావుడి చేశారు. ఇదిలా ఉంటే వీధి కుక్కలు మాత్రం బుకింగ్ కౌంటర్ వద్ద విశ్రాంతి తీసుకుంటూ కనిపించాయి. ఇంత చేసినా కుక్కలను మాత్రం నియంత్రించ లేకపోయారు. ఇక్కడ నిత్యం కుక్కల సంచారంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. రైల్వే అధికారులు, సిబ్బందికి ఈ కుక్కలు కనిపించక పోవడంతో అక్కడికి వచ్చిన వారంతా అవాక్కయ్యారు. ఇప్పటికైనా స్టేషన్‌లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలను నిలువరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మాకొద్దు మాయదారి మద్యం దుకాణం..!



కాపవరంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ నిరసన చేస్తున్న గ్రామస్తులు

మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకున్న కాపవరం గ్రామస్తులు

పెరవలి: నివాసాల వద్ద మద్యం దుకాణం వద్దంటూ స్థానికులు నిరసనకు దిగారు. పెరవలి మండలం కాపవరం గ్రామంలో నూతనంగా మంజూరైన మద్యం షాపును ఏర్పాటు చేయటానికి నిర్వాహకులు ప్రయత్నించడంతో గ్రామలంతా ఏకమై అడ్డుకుని గురువారం నిరసనకు దిగారు. కాపవరం గ్రామానికి చెందిన చోడపునీడి జానికీరాముడు మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామంలో కనీసం బెల్ట్ షాపు కూడా ఏర్పాటు చేయకుండా చూసుకున్నామని ఇప్పుడు నేరుగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నారని దీనిని తామంతా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా ఉండేందుకు ఎంతటి స్థాయిలో పోరాటానికైనా సిద్ధమన్నారు. గ్రామస్తులంతా కలిసి తహసీల్దార్ అచ్యుత కుమారికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చింతలపూడి శివశంకర్ ప్రసాద్, పిప్పర లీలాకృష్ణ, పిప్పిర శివ, వక్కపట్ల వంశీ, రాజేంద్ర, అడపా మణికంఠ, సాయిచరణ్, చింతలపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'నవోదయం'తో సారా నిర్మూలన



రికార్డులు పరిశీలిస్తున్న చైతన్య మురళి

దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సారా నిర్మూలనకు నవోదయం కార్యక్రమం చేపట్టామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ (కాకినాడ) వై.చైతన్య మురళి తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా దేవరపల్లి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, నవోదయం కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలను భాగస్వాములను చేసి, సారా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సారాను పూర్తిగా నిర్మూలించడానికి మరో సంవత్సరం పడుతుందన్నారు. గంజాయి, సారా విక్రయాలను ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు. బెల్టు దుకాణాల సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. మద్యం దుకాణాల్లో అధిక ధరలకు మద్యం అమ్ముతున్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెబ్ నుంచి ఎక్సైజ్ ఏర్పడిన తర్వాత దేవరపల్లి సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకూ 294 కేసులు నమోదయ్యాయని మురళి చెప్పారు. కార్యక్రమంలో సీఐ బళ్ల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోసిబాబు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం



యర్నగూడెంలో పోసిబాబు కుటుంబ సభ్యులకు రూ.లక్ష సాయం అందజేస్తున్న తోటి కార్మిక కుటుంబాలు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం వద్ద ఉన్న 3ఎఫ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుడు పుట్టా పోసిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు వీధిన పడ్డారు. పోసిబాబు కుటుంబానికి తోటి కార్మికుల కుటుంబం అండగా నిలబడింది. గ్రామంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ద్వారా పోసిబాబు కుటుంబ ఆర్థికక పరిస్థితిని ఫ్యాక్టరీ ప్రొడక్షన్ మేనేజరు శివరామ్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కార్మిక కుటుంబ సభ్యులు రూ.లక్ష ఆర్థికసాయాన్ని గురువారం పోసిబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడు పోసిబాబు ఫ్యాక్టరీలో బాయిలర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో అనపర్తి శివరామకృష్ణ, గన్నమని రామకృష్ణ, కేవీ రావు, ప్రభాకరరావు, యాదాల భీమేశ్వరరావు, పుట్టా శ్రీనివాస్, దేవరాజు వాసు, పుట్టా సాయిగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజు



ముప్పిడి రాజును సత్కరిస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు

కొవ్వూరు: సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన కొవ్వూరు ఎస్సీ బాలుర వసతి గృహం సంక్షేమ అధికారి ముప్పిడి రాజును గురువారం రాత్రి పట్టణంలో ఘనంగా సత్కరించారు. సాంఘిక సంక్షేమ ఉద్యోగులు, అరుంధతీ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నాయకుల ఆధ్వర్యంలో స్థానిక సంక్షేమ వసతిగృహంలో అభినందన సభ నిర్వహించారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారిణి మేరీ మాత, హెచ్‌డబ్ల్యూవో శ్రీలత, విశ్రాంత సహాయ సాంఘిక సంక్షేమ అధికారి సాల్మన్‌రాజు, గెడ్డం శంకర్రావు, రిటైర్డు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు పెనుమాక జయరాజు, రిటైర్డు హెడ్ మాస్టార్ సనమండ్ర కాంతరావు, తిరిగిపల్లి రవికుమార్, రిటైర్డు జిల్లా జడ్జి భీష్మ గాంధీయుడు, అరుంధతీ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి



తాళ్లపూడి ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ



పెరవలి ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్

తాళ్లపూడి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు సూచించారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ పోసిరాజు మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని ప్రజల అవసరాలను గుర్తించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళా సాధికారత, హైస్కూల్ స్థాయి పిల్లలకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటి పరిష్కారం, గ్రామాల అభివృద్ధి తదితర అంశాలపై కార్యదర్శులు చేపట్టాల్సిన కార్యాచరణను ఎంపీడీవో వెంకటరమణ వివరించారు. 2025- 2026 సంవత్సరానికి గానూ మౌలిక వసతులు, ఆర్థిక అభివృద్ధి అంశాలను గుర్తించాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేయటం ద్వారా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వీరన్న, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

దేవరపల్లి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక-2025-26పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ డి.రాజారావు మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి, సంబంధిత ప్రణాళికలు, వాటి అమలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శిక్షణ పొందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయం పర్యవేక్షకురాలు జి.శాంతి, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

నల్లజర్ల: మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ సింహాద్రి మాట్లాడుతూ పంచాయతీలకు స్థానికంగా వచ్చే వనరులు, ఖర్చులు తదితర వాటిని వివరించారు. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో 2025-26 సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు.

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి

పెరవలి: గ్రామ పంచాయతీలకు వచ్చే ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకుని గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు తోడ్పాటు అందించాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ కోరారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి గానూ వార్షిక ప్రణాళికపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు గురువారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు ప్రగతి పథంలో పయనించాలంటే అందుబాటులో ఉండే వనరుల లభ్యతను బట్టి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి బడ్జెట్ రూపొందించుకోవాలన్నారు. ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ వార్షిక ప్రణాళిక తయారు చేసే ముందు గ్రామంలో పన్నులు, పన్నేతరాల నుంచి ఎంత ఆదాయం వస్తుందో దానిని బట్టే ఖర్చులు చేయాలన్నారు. గ్రామాల్లో ముఖ్యంగా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే దోమల నివారణ, చెత్త సేకరణ సక్రమంగా జరగాలన్నారు. కార్యక్రమంలో ఏపీయం రామకృష్ణ, హౌసింగ్ డీఈ విక్టర్‌బాబు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికకు సంబంధించి ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన అంశాలపై ఎంపీడీవో శ్రీదేవి, విస్తరణాధికారి శ్రవణ్ కుమార్‌లు ప్రజా ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మట్టా వీరాస్వామి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలి



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జగన్నాథరావు

నిడదవోలు రూరల్: గ్రామ పంచాయతీల ఆదాయ వనరులు పెంచడంతో పాటు గ్రామాల అభివృద్దే ధ్యేయంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రణాళిక ఉద్యమం, 2025-26 గ్రామ పంచాయతీ ప్రణాళిక, మండల పరిషత్ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలపై ప్రజా ప్రతినిధులకు గురువారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఏఓ జగన్నాథరావు మాట్లాడుతూ 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు సంబంధించి పుష్కర ఘాట్లు ఉన్న గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ట్రైనీ కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అసంపూర్తి గృహ నిర్మాణాలకు ఆర్థిక సాయం

ఒక్కో లబ్ధిదారుకు రూ.50 వేల మంజూరు

నిడదవోలు: అసంపూర్తిగా నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన లబ్దిదారులకు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. పట్టణ పరిధిలోని పీఎంఏవై అర్బన్ బీఎల్‌సీ 1.0 పథకంలో భాగంగా అర్హులైన వారి ఇళ్లు నిర్మాణంలో ఉన్నా, అసంపూర్తిగా ఉన్నా అదనంగా సబ్సిడీ రూపంలో ఎస్సీ, బీసీ కులాల లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల చొప్పున మంజూరు చేస్తామని కమిషనర్ కృష్ణవేణి పేర్కొన్నారు. పట్టణ పరిధిలో 1,162 మంది లబ్ధిదారులకు రూ.5.91 కోట్లు మంజూరయ్యిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కమిషనర్ కోరారు.

తాళ్లపూడి: అసంపూర్తిగా నిలిచిపోయిన గృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తుందని తాళ్లపూడి మండల హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను కట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేక అసంపూర్తిగా వదిలేసిన ఇంటి నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చుకునేందుకు గాను ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. మండలంలో బీసీ, ఎస్సీ కుటుంబాలకు చెందిన 192 మంది ఇళ్ల నిర్మాణాలు చేయలేక వెనుకబడ్డారన్నారు. ఈ నిధులతో త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు.

జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ

కంబాలచెరువు: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఒక్క రోజు జాతీయ సదస్సులో ఆర్ట్స్ కళాశాల రాజనీతి శాస్త్రం విద్యార్థులు అద్భుత ప్రతిభను కనపరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే గురువారం తెలిపారు. ఎం.తోష అనే విద్యార్థిని సింధూ నాగరికత పరిపాలనలో మతం పాత్ర పరిశోధన పత్రంపై వివరణ ఇచ్చిందన్నారు. సీహెచ్.అఖిల, నూర్జహాన్, జె.రమేష్, కె.వాణి, సూర్యచంద్ర, కె.సంధ్య, లావణ్య, వి.ప్రవల్లిక భారత పరిపాలనాచరిత్ర లోని వివిధ అంశాలపై పోస్టర్ ప్రెసెంటేషన్ ప్రతిభవంతంగా చేసి అందరి మన్ననలు అందుకున్నారన్నారు. వీటిలో నూర్జహాన్‌కు ప్రథమ స్థానం, నగదు బహుమతి లభించాయన్నారు. సదస్సులో రాజనీతిశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ బాబ్జీ, డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి, కేపీబీఎల్ సరోజ, రామారావు, రామకృష్ణ, తులసి కుమారి పరిశోధనా పత్రాలను సమర్పించారన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వినతి



కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ నాగేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న యనాద కాలనీవాసులు

కొవ్వూరు: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి నిధులతో యనాద కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ప్రకటించారు. గురువారం ఆయన పట్టణంలోని యనాద కాలనీలో పర్యటించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సమస్యలు పరిష్కారించాలని కోరుతూ నాగేంద్రకు వినతిపత్రం అందజేశారు. పరిమి రాధాకృష్ణ, బీవీ ముత్యాల రావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, గంట్రోతు పవన్, పోణంగి పవన్‌లతో పాటు యనాద కాలనీ పెద్దలు పొట్లూరి గాంధీ, కొమ్మే గోపాలం, వల్లూరి బుచియ్య, చెరుకూరి వెంకటరత్నం, మర్రి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.